నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

8 | నిజామాబాద్ శనివారం 24 మే 2025 | ADILABAD NIRMAL




కొనుగోలుకేంద్రంలో తడిసిన బస్తాల నుంచి వచ్చిన మొలకలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

# ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనాలి

- ఎలాంటి షరతులు విధించవద్దు
- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, మే 23 : కొనుగోలు కేంద్రంలో తడిసిన ప్రతి గింజనూ ఎలాంటి షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం నేరడిగొండ లోని వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం ఆవరణలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో నియోజకవర్గం లోని జొన్న రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యంతో ఎలాంటి దిగులు చెందవద్దని, తాను దగ్గరుండి తడిసిన ధాన్యాన్ని కొనేలా చూస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. వర్షాలతో తడిసిన ధాన్యం నుంచి మొలకలు రావడాన్ని పరిశీలించారు. ఇప్పటికైనా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గింజనూ ఎలాంటి షరతులు లేకుండా కొనాలని డిమాండ్ చేశారు. ఎలాంటి జాప్యం చేయకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేస్తే రైతులు ఈ కష్టాలు వచ్చేవి కావని మండిపడ్డారు. వచ్చే సీజన్‌లోనైనా ధాన్యం తడిసి పోకుండా ఉండాలంటే నియోజకవర్గంలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రం వద్ద గోదాంలు నిర్మించాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి, తుల శ్రీనివాస్, నాయకులు కృష్ణారెడ్డి, శిరీష్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, అభిలాష్, దివాకర్‌రెడ్డి, విజయ్, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులకు పునరావాసం కల్పిస్తాం



వీధివ్యాపారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 23 : వీధి వ్యాపారులకు పునరావాసంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో వీధి వ్యాపారులకు నూతనంగా పునరావాసం కల్పించిన ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పరిశీలించి చిరు వ్యాపారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ విద్యుత్ సౌకర్యం, పార్కింగ్, తదితర మౌలిక వసతులు కల్పిస్తామని లిపారు. వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ పునరావాసం కల్పించి మాత్రమే షాపులు తొలగించాలని మున్సిపాలిటీ తీర్మానిస్తామని తెలిపారు. దీంతో వీధి వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వినోద్ కుమార్, డీఎస్పీ జీవన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, అధికారులు, తదితరులు ఉన్నారు.



# పచ్చిరొట్ట రాకపాయె..!

## నిర్మల్ జిల్లాకు చేరని జీలుగ, జనుము విత్తనాలు

- ముందుచూపు లేని అధికార యంత్రాంగం
- వరి కోతలు ముగిసి నెల దాటినా సరఫరా చేయని సర్కారు
- అదును దాటుతున్నదని అన్నదాతల ఆందోళన

నిర్మల్, మే 23(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికే రైతు భరోసా అందక, రుణమాఫీ జరుగక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు కనీసం విత్తనాలను కూడా సకాలంలో అందించే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో యాసంగి సీజన్ ముగిసి దాదాపు నెల రోజులు గడుస్తున్నది. ఇప్పటికే చాలా చోట్ల వరి కోతలు సైతం పూర్తయ్యాయి. వచ్చే వానకాలం పంటల సాగు కోసం వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ క్రమంలో రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. సాధారణంగా యాసంగి పంటలు చేతికొచ్చిన వెంటనే రైతులు తమ భూముల్లో భూసారం పెంచేందుకు పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగను సాగు చేస్తారు. 30 నుంచి 40 రోజుల పాటు ఈ మొక్కలను పెంచిన తర్వాత రైతులు దమ్ము చేసి వానకాలం పంటలను వేస్తారు. జీలుగ మొక్కలను అలాగే దున్నడం వల్ల మొక్కల్లోని కనుపుల్లో ఉండే సూక్ష్మ జీవులు పంటలకు అవసరమైన పోషకాలను అందించేందుకు సహాయపడతాయి. దీంతో పాటు భూమిలో నత్రజని శాతం పెరిగి అధిక పంట దిగుబడులు వస్తాయి. ఇలా రైతులకు అన్ని విధాలుగా మేలు చేసే పచ్చిరొట్ట విత్తనాలు ఇప్పటి వరకు జిల్లాకు చేరలేదు. అధికార యంత్రాంగానికి ముందుచూపు లేని కారణంగానే ఈ పరిస్థితి నెలకొన్నదని రైతులు వాపోతున్నారు. పక్క జిల్లాల్లో అందుబాటులో ఉన్న జనుము, జీలుగ విత్తనాలు నిర్మల్ జిల్లాలో మాత్రమే లేకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. జిల్లాకు అవసరమైన విత్తనాలను సకాలంలో తెప్పించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మల్ జిల్లాలో ప్రతి సంవత్సరం ఈ సీజన్‌లో 3,500 నుంచి 4 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అవసరమవుతాయి. వాస్తవానికి రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వానకాలం సీజన్‌కు ముందే ఏప్రిల్‌లో విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలి. 50 శాతం సబ్సిడీతో అందజేసే ఈ విత్తనాలు ప్రస్తుతం జిల్లాలో అం దుబాటులో లేకపోవడంతో కొంతమంది రైతులు ఎక్కువ డబ్బులు పెట్టి పక్క జిల్లాల నుంచి కొంటున్నట్లు చెబుతున్నారు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా రూ.4,260 కాగా 50శాతం సబ్సిడీ పోనూ రూ.2,130లకు విక్రయించాలి. కాని కొందరు డీలర్లు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని ఇదే అదనుగా ధరలు పెంచేసి ఒక్కో బస్తాను రూ.3 వేల వరకు విక్రయిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

### అదును దాటుతున్నదని రైతుల ఆందోళన

జిల్లా వ్యాప్తంగా వానకాలం సీజన్‌లో రైతులు ఎక్కువగా పత్తి, వరిపంటలను సాగు చేస్తారు. ఏటా దాదాపు 4.33 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతుండగా, ఇందులో పత్తి 1.68లక్షల ఎకరాలు, వరి 1.35 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేస్తుంటారు. వరినారు వేసింది మొదలు పంట చేతికొచ్చే వరకు వివిధ దశల్లో దాదాపు 66వేల మెట్రిక్ టన్నుల ఎరువులను జిల్లా రైతులు వినియోగిస్తుంటారు. ఇందులో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ లాంటి రసాయన ఎరువులు ఉంటాయి. అయితే చాలామంది రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు వేసేందుకు మొగ్గు చూపుతారు. దీనివల్ల పొలం సారవంతంగా మారి వరిపంటకు అవసరమైన పోషకాలు పుష్కలంగా అందుతాయి. పచ్చిరొట్ట వినియోగం కారణంగా రసాయన ఎరువుల వినియోగం కూడా సగానికి తగ్గిపోతుంది. దీంతో రైతులపై ఎరువుల భారం సైతం తగ్గడంతో ఆర్థికంగా మేలు జరిగే అవకాశం ఉన్నది. రసాయన ఎరువుల వినియోగం కంటే పచ్చిరొట్ట ద్వారా పండించిన పంటల ఎదుగుదల బాగుండి అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జనుము, జీలుగ మొక్కలు భూమి ఉపరితలంలోనే ఉండి పంటలకు కావాల్సిన పోషకాలను నేరుగా అందిస్తాయి. ఇంతలా మేలు చేసే పచ్చిరొట్ట విత్తనాలు జిల్లాలో అందుబాటులో లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు మండిపడుతున్నారు. ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలు వేసే అదను కూడా దాటిపోతున్నదని, ఇప్పుడు వేసినా వానకాలం పంటలు ఆలస్యమై నష్టపోయే అవకాశం ఉంటుందని రైతులు వాపోతున్నారు. కాగా విత్తనాల కొరతపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజిప్రసాద్‌ను వివరణ కోరగా, పచ్చిరొట్ట విత్తనాలు ప్రస్తుతం అందుబాటులో లేవని, రెండు మూడు రోజుల్లో జిల్లాకు చేరుకుంటాయని తెలిపారు.

# నాలుగు కోడ్‌లను రద్దు చేయాలి

### కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా

ఎదులాపురం, మే 23 : కార్మికులను బానిసయుగంలో నెట్టేలా కేంద్రం తీసుకువచ్చిన నాలుగు కోడ్లను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మె విజయవంతం కోసం శుక్రవారం కార్మిక శాఖ కార్యాలయం ఎదుట కార్మిక సంఘాలతో కలిసి ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు బ్రిటిష్ కాలంలో కార్మికులు త్యాగాలు చేసి 44 చట్టాలను సాధించారని తెలిపారు. కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ వాటిని కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నాలుగు కోడ్లుగా చేసిందని ఆరోపించారు. కొందరి కోసం కోట్ల మంది కార్మికులకు అన్యాయం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా కోడ్లను రద్దు చేయడంతో పాటు కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న చేపట్టే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు దేవేందర్, ఎస్కే సలీం, ఎస్.జమీల్, ఎండీ ముజీబ్, ఎండీ ఖాసీం, మంతెన కాంతారావ్, చిరంజీవి, మహేందర్ తదితరులున్నారు.



కార్మికశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

# నిర్మల్ జిల్లాలో 10.5 మి.మీటర్ల వర్షపాతం



దస్తురాబాద్ : వర్షానికి విరిగి పడిన చెట్టు

నిర్మల్ అర్బన్, మే 23 : నిర్మల్ జిల్లాలో గడిచిన 24 గంటల్లో సగటున 10.5 మి.మీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కుభీర్ 3.4 మి.మీ, తానూర్ 15.4, బాసర 8.2, ముథోల్ 20, భైంసా 18.2, కుంటాల 4.8, నర్సాపూర్ (జీ) 8.6, లోకేశ్వరం 11.4, దిలావర్‌పూర్ 7.0, సారంగాపూర్ 14.6, నిర్మల్ 5.8, నిర్మల్ రూరల్ 5.6, సోన్ 15.4, లక్ష్మణ్ చాంద 8.4, కడెం 9.4, దస్తూరాబాద్ 8.4, మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షంతో పలు చోట్ల కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనాలని రైతులు కోరుతున్నారు.

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

# బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, అధికారులు

సోన్, మే 23 : జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్‌లో బాల్యవివాహాల నిర్మూలన, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం, మాదక ద్రవ్యాల నిర్మూలన, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం, ఇసుక అక్రమ రవాణా, మున్సిపల్ అంశాలు, రహదారి భద్రత, రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాల పంపిణీ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. గత రెండేళ్లలో జిల్లాలో 29 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు, రోగ నిర్ధారణ పరీక్షల కేంద్రాలను తనిఖీ చేస్తూ కేంద్రాల్లో పని చేస్తున్న వారి అర్హత పత్రాలను వైద్యశాఖ అధికారులు సరిచూడాలన్నారు. నిషేధిత మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాల రహితంగా జిల్లాగా నిర్మల్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కేసుల విచారణ వేగవంతం చేయాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ జానకీ షర్మిల మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించడానికి సంక్షేమ, పోలీసుశాఖలు సమన్వయంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు ఎస్పీలు అవినాష్‌కుమార్, రాజేశ్‌మీనా, ఉపేంద్రరెడ్డి, సంక్షేమ, వైద్యరోగ్య, పోలీసు, అబ్కారీ, ఆర్అండ్‌బీ, మున్సిపల్, రెవెన్యూ, వ్యవసాయ, విద్యా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్‌బిడ్‌లో భూవివాదంపై విచారణ



భూ సర్వేను పరిశీలిస్తున్న భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, ఏఎస్పీ అవినాశ్ కుమార్

ముథోల్, మే, 23: ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో శుక్రవారం భూ వివాదంపై భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ విచారణ జరిపారు. కొంతమంది తన భూమిని ఆక్రమించి ఇండ్లు నిర్మించుకున్నారని బాధితుడు కొండపురం సాయన్న ఏప్రిల్ 27న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. భూ వివాదంపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆర్డీవో, ఏఎస్పీకి కమిషన్ ఆదేశించింది. ఇందులో భాగంగా ఆర్డీవో, ఏఎస్పీ గ్రామానికి వెళ్లి బాధితుడితో పాటు భూవివాదంలో సంబంధం ఉన్న వారిని కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు ఇరువురు అందజేయాలని సూచించారు. వివాదంలో ఉన్న భూమికి కొలతలు నిర్వహించాలని మండల సర్వేయర్ ప్రవీణ్‌ను ఆదేశించారు. దీంతో తహసీల్దార్ శ్రీలత ఆధ్వర్యంలో సర్వేయర్‌తో పాటు, ఆర్ఐలు నారాయణ రావు పటేల్, సరస్వతీ, రెవెన్యూ సిబ్బంది భూమి కొలతలు నిర్వహించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్ఐ సంజీవ్, పంచాయతీ కార్యదర్శి శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్ రూరల్ : గోసంవాడ-మెట్‌పెల్లి ప్రధానరహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

# ఆకాశంలో మబ్బులు.. రైతుల్లో గుబులు

- వీడని వాన.. అన్నదాతలు ఆగమాగం
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని వేడుకోలు



ఖానాపూర్‌లోని కొనుగోలు కేంద్రం వద్ద కమ్ముకున్న కారుమబ్బులు

ఖానాపూర్, మే 23: మూడు రోజులుగా మోస్తారు వర్షంతో తడిసిన ధాన్యంతో ఇబ్బంది పడుతుంటే ఆకాశంలో నల్లటి మబ్బులు, ఈదురుగాలులతో కూడి వాతావరణం రైతన్నలను కంటి మీద కునుకులేకుండా చేస్తున్నది. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం ఆరబెడుదామంటే ఎప్పుడు వాన వస్తుందోనని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండల పరిధిలో 10322 ఎకరాల్లో వరి పంట వేయగా ఇందులో 9296 దొడ్డు రకం, 1026 ఎకరాల్లో సన్నరకం సాగు చేశారు. ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువస్తున్నారు. అయితే కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ కవర్లను నిర్వాహకులు ఇవ్వకపోవడంతో వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాల్లో లారీలు, హామాలీల సంఖ్య పెంచి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఖానాపూర్, దిలావర్‌పూర్, సత్తనపెల్లి, మస్కాపూర్, తర్లపాడు, పాత తర్లపాడు, ఎక్బాల్‌పూర్, తదితర గ్రామాల రైతులు కోరుతున్నారు.

### కుంటాల మండలంలో..

కుంటాల, మే, 23 : కుంటాల మండలంలోని అంబకంటి, వెంకూర్, విట్టాపూర్, ఓలా, కుంటాల, కల్లూరు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో తూకానికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోళ్లకు వర్షం ఆటంకంగా మారింది. శుక్రవారం మళ్లీ మబ్బులు కమ్ముకోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.

### కొనుగోళ్లలో జాప్యం..తడుస్తున్న ధాన్యం

దస్తురాబాద్, మే 23 : వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలింపులో అధికారులు, నిర్వాహకులు అలసత్వం వహించడంతో అకాల వర్షాలతో రైతులు తంటాలు పడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడం..మళ్లీ వర్షంలో తడవడం..ఇలా పదే పదే ఆరబెట్టేందుకు రైతులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. రైస్ మిల్లుల్లో కోత లేకుండా ధాన్యాన్ని దించుకునే విధంగా అధికారులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు. శుక్రవారం కురిసిన వర్షానికి పెర్కపల్లె -మున్యాల ప్రధాన రహదారిపై చెట్లు నేలకొరిగాయి.

### తడిసిన ధాన్యాన్ని కొనాలని రైతుల ధర్నా

ఖానాపూర్ రూరల్, మే 23 : తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని సుర్జాపూర్, బాదనకుర్తి, మేడంపెల్లి గ్రామ రైతులు మెట్‌పెల్లి ప్రధాన రహదారిపై ధర్నాలో బైఠాయించారు. గురువారం రాత్రి భారీ వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని 100 మందికి పైగా రైతులు ప్రధాన రహదారిపై ధర్నాలో బైఠాయించారు. తడిసిన ధాన్యాన్ని కోతలు విధించకుండా కొనాలన్నారు. సుమారు గంట వరకు ధర్నా కొనసాగింది. తహసీల్దార్ ఘటనా స్థలానికి చేరుకొని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బూసి నరేందర్, బక్కశెట్టి అశోక్, బర్లపేట్ రాజేందర్, బొమ్మెన రాకేశ్, పుప్పాల ఉపేందర్, శనిగారపు శ్రావణ్, నరేందర్, తుప్ప నరేందర్, మహిపాల్, ప్రవీణ్, అనుప హరీశ్, రైతులు పాల్గొన్నారు.